

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మండవల్లి : పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. 34 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. 1989–1990 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు అలనాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి జ్ఞాపకాల నుంచి ప్రస్తుతం ఏం చేస్తున్నారు తెలుసుకుంటూ కుటుంబ యోగక్షేమాలపై ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా అనాటి గురువులు డ్రాయింగ్ మాస్టారు ఎల్ఎస్.భాస్కరరావు, హిందీ టీచర్ జానకిరామయ్య, తెలుగు ఉపాధ్యాయులు ఎ.కె.మహాలక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ అట్లూరి వెంకటేశ్వరరావులను ఆప్యాయంగా పలకరించి శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించుకున్నారు.

కొల్లేరు సమస్య పరిష్కారమయ్యేనా..!

వలస బాటలో కొల్లేటి ప్రజలు

నేతలిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతున్న వైనం



ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తాం.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఉపాధి కల్పిస్తాం.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి కొల్లేరు ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాం అని నేతలు ఎన్నికల సందర్భంగా హామీలివ్వడం, ఆపై మరవడం సర్వసాధారణమైంది. కొల్లేరుకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి అక్కడి ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా చూస్తామని పదేళ్ల క్రితం భీమవరం సభలో అప్పటి ప్రధాని అభ్యర్థి మోడీ హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకొచ్చి పదేళ్లయ్యింది. మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పదేళ్లలో కొల్లేరు సమస్య పరిష్కారానికి ఎటువంటి ముందడుగూ పడలేదు. కొల్లేరు సమస్య పరిష్కారం కావాలంటే బిజెపిని గెలిపించాలని కైకలూరు సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ప్రస్తుతం కొల్లేరు ఎక్కువగా విస్తరించి ఉన్న కైకలూరు నియోజకవర్గంలో బిజెపి, ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, దెందులూరు, ఉండి నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. మరి ఈ ఐదేళ్లలో కొల్లేరు సమస్యను ఏ మేర పరిష్కరిస్తారో వేచిచూడాలి.

కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఇప్పటివరకూ నేతలిచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోకపోవడంతో అక్కడి ప్రజలు జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరు ప్రాంతంలో జీవనోపాధి లేక బతుకుదెరువు నిమిత్తం కొల్లేరు ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోతున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సు మండవల్లి మండలంలో కొంతమేర విస్తరించి ఉంది. కొల్లేరుపై ఆధారపడి సుమారు 15 గ్రామాల్లో సుమారు 16 వేల మంది జీవిస్తుంటారు. రెగ్యులేటర్ లేకపోవడంతో నిరంతరం సముద్రంలోకి నీరువెళ్లిపోవడంతో వేసవిలో ఎడారిని తలపిస్తూ ఉంటుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మోడీ భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని కొల్లేరు ప్రాంత ప్రజలకు వరాల జల్లులు కురిపించారు. రెగ్యులేటర్ నిర్మిస్తామని, కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని అదనంగా కొల్లేరును పునరుద్ధరిస్తానని వరాల జల్లు కురిపించారు. ఆ ఎన్నికల్లో కేంద్రంలో మోడీ అధికారం చేపట్టగా కైకలూరు ఎంఎల్ఎగా కామినేని శ్రీనివాసరావు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నేటికీ పదేళ్లు గడుస్తున్నా కొల్లేరు ప్రాంతప్రజలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారని కొల్లేరువాసులు పెదవి విరుస్తున్నారు. అంతేకాకుండా ఎకో సెన్సిటివ్ జోన్‌లోకి కొల్లేరును తీసుకొచ్చి గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేయించే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శలు ఉన్నాయి. కొల్లేరును అభివృద్ధి చేస్తామని హామీలు గుర్తించి ఎకో సెన్సిటివ్ జోన్ తీసుకురావడం ఎంతవరకూ సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల నుంచి కొల్లేరుపై ఆధారపడి జీవనం సాగించే ఇక్కడ ప్రజలు ఇంకెక్కడికి వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పలు పార్టీల రాజకీయంగా కాకుండా కొల్లేరును, కొల్లేరు ప్రాంత ప్రజలను, గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా చర్యలు తీసుకుని వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కొల్లేటి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తక్షణం కొల్లేరులో రెగ్యులేటర్ నిర్మించాలి

ఎల్ఎస్.భాస్కరరావు, సామాజిక వేత్త

కొల్లేరు అభివృద్ధితోనే ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. అందుకోసం తక్షణం రెగ్యులేటర్‌ను నిర్మించాలి. రెగ్యులేటర్ లేకపోవడం వల్ల జనవరిలోనే కొల్లేరు ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. అందువల్ల కొల్లేటి ప్రాంత ప్రజల జీవన భృతి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. హామీలు నెరవేర్చి కొల్లేరును అభివృద్ధి చేసి కొల్లేటి ప్రాంత ప్రజలను ఆదుకోవాలి. కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

కొల్లేరును ఓటు బ్యాంకుగా పరిగణించడం తగదు

తెంటు అప్పారావు,
ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు


కొల్లేటి ప్రాంత ప్రజలను ఓట్ల కోసం వినియోగించుకుని అభివృద్ధి గాలికి వదిలేయడం సరికాదు. ఓటు బ్యాంకుగా కాకుండా అభివృద్ధి చేసే కొల్లేరు ప్రాంత ప్రజలతో పాటు కైకలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుంది. రాజకీయ నాయకులు ఆ విధంగా ఆలోచించి అభివృద్ధి చేయాలి.

కేంద్ర మంత్రిగా వర్మ


భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర మంత్రి వర్గంలో జిల్లాకు మరోసారి చోటు దక్కింది. నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. తొలిసారి ఎంపీగా ఎన్నికైన వర్మకు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గతంలో బిజెపికి చెందిన సినీ నటుడు కీర్తిశేషులు యువి.కృష్ణంరాజు నరసాపురం ఎంపీగా బాధ్యతలు నిర్వహిస్తూ కేంద్ర మంత్రి పదవి చేపట్టారు. 2014 ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా బిజెపికి చెందిన గోకరాజు రంగరాజు ఎన్నికయ్యారు. రాష్ట్రం నుంచి బిజెపి తరపున ఎంపీలుగా ఎన్నికైన వారిలో పురంధేశ్వరి, సిఎం రమేష్ వంటి సీనియర్లు ఉన్నప్పటికీ వారందరినీ పక్కన పెట్టి వర్మకు కేంద్ర మంత్రి మండలిలో చోటు ఇవ్వడం గమనార్హం. శ్రీనివాసవర్మ బిజెపి జిల్లా అధ్యక్షులుగా పనిచేసి తరువాత రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఆయనకు భీమవరం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.



నిరసన తెలుపుతున్న కార్మికులు

కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల నిరసన దీక్షలు

సమస్యను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - గణపవరం

మూడు రోజులుగా ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, తమను అన్యాయంగా తొలగించిన ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎఫ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఫ్యాక్టరీ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు మూడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నష్టాల బాటలో ఉందనే వంకతో కార్మికులను బయటకు నెట్టడం దారుణమన్నారు. కనీసం తమతో గానీ, జిల్లా లేబర్ అధికారులతో గానీ తమ సమస్యలపై చర్చించకుండా గేట్లకు తాళం వేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే వేతనాల్లేక తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, జిల్లా అధికారులు వెంటనే కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాలని, మరలా ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కరించే వరకూ వివిధ దశల్లో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వై.రామకృష్ణ, ఏసుబాబు, జి.శ్రీనివాసరాజు, బి.రాధాకృష్ణ, ఎస్.రమణ, డి.సాయికృష్ణ పాల్గొన్నారు.

ఓఅండ్ఎం పనులు హుళక్కేనా..!

శిథిలావస్థలో లాకులు, షట్టర్లు.. ఆందోళనలో రైతులు

ముందస్తు సాగు పేరుతో జూన్ 1న ప్రభుత్వం కాలువలకు నీటిని విడుదల చేసింది. అయితే కాలువలు మూసివేసిన అనంతరం చేపట్టాల్సిన ఆధునికీకరణ పనులు గత ఐదేళ్లుగా అతీగతీ లేని సంగతి అందరికీ తెలిసిందే. అయితే కాలువలకు నీటిని విడుదల చేశాక హడావుడీగా తూడు, గుర్రపు డెక్క, చెత్తాచెదారం, తొలగింపు పనులు చేపట్టి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైంది. అయితే ఈసారి ఎన్నికల కోడ్ పేరుతో ఆ పనులకు ప్రభుత్వం ఎగనామం పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో కాలువలకు నీరు విడుదల చేసి పది రోజులు అవుతున్నా శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.


బీటలువారిన మెండి డ్యామ్

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలో నీటిపారుదల వ్యవస్థలో ఎంతో కీలకమైన లాకులు, వియర్లు, షట్టర్లు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పునర్నిర్మాణం, మరమ్మతులు సాగునీటి కాలువల నిర్వహణలో అత్యవసర పనులకు నీలినీడలు కమ్ముకున్నాయి. ఏటా వేసవిలో ఓఅండ్ ఎం నిధులతో పనులు జరుగుతుంటాయి. దీనికి సంబంధించి ప్రతిపాదనల జాబితా నాలుగు నెలల కిందటే రూపొందించినా నేటికీ ఆమోదం లభించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పశ్చిమడెల్టాలో ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం సబ్ డివిజన్ల పరిధిలో 11 ప్రధాన పంట కాలువలు ఉన్నాయి. 4.60 లక్షల ఎకరాల విస్తీర్ణానికి కాటన్ బ్యారేజీ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నారు. డెల్టాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యేది వరి. సాధారణంగా ఓఅండ్ఎంలో అత్యవసర పనులను ప్రతిపాదిస్తుంటారు. ఈ ఏడాది నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో రూ.17.14 కోట్ల అంచనా వ్యయంతో 166 పనులను ప్రతిపాదించారు. వీటిలో తూడు తొలగింపు, పూడికతీత, తారు, ఆయిల్‌పూత, ఎత్తిపోతలు, షట్టర్ల మరమ్మతులు, గట్ల పటిష్టీకరణ పనులు ఉన్నాయి. మరో 12 ఇతర పనులకు రూ.1.26 కోట్లు అవసరమని తేల్చారు. వీటికి ఇప్పటికే ఆమోదం లభిస్తే టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలయ్యేది.

వృథాగా పోతున్న సాగునీరు..

ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన లాకులు, సర్ ప్లస్ ఇయర్, అవుట్ పాల్ స్లూయిజ్‌లు, షట్టర్లు, శిథిలావస్థకు చేరాయి. వీటి పునర్నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. కాలువలపై షట్టర్లు సరిగా పనిచేయని చోట్ల సాగునీరు వృథాగా పోతోంది. రబీలో సుమారు 50 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాలువలో అవరోధాలు తొలగించేందుకు ఒఅండ్ఎం నిధులే కొంతమేర ఊరటనిస్తున్నాయి. నిధులు మంజూరు చేయలేదు.


పొట్టిలంక ఛానల్‌పై దెబ్బతిన్న షట్టర్

శిథిలావస్థలో లాకులు, షట్టర్లు..

వెంకయ్య వయ్యేరు, ఉండి పంట కాలువల పరిధిలోని అధిక శాతం లాకులు, షట్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కాలువల పరిధిలో షట్టర్లు దెబ్బతిన్న కారణంగా పూర్తిస్థాయిలో శివారు గ్రామాలకు నీరందడం లేదు. అధిక వర్షాలు, వరదల సమయంలో శిథిలావస్థకు చేరుకున్న షట్టర్లు, చెక్‌డ్యామ్ లేచిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు పడిన సమయాల్లో అన్నదాతలు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ఇరిగేషన్ శాఖ అధికారులు అత్యవసర పనులపై ఇప్పటికీ శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా కాలువల్లో తూడు గుర్రపుడెక్క, చెత్తా చెదారం తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అత్యవసర పనులకు ప్రతిపాదనలు పంపాం..

ఇరిగేషన్ ఇఇ ఎం.దక్షిణామూర్తి

నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో రూ.17.14 కోట్ల అంచనా వ్యయంతో 166 పనులను ప్రతిపాదించాం. కాలవలపై అవసరమైన పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతాం. జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తాం.


సత్తిరాజు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

వ్యకాస నేత సత్తిరాజు కన్నుమూత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక ఉద్యమ నేత కూనపరాజు సత్యనారాయణరాజు (80) ఆదివారం ఆయన స్వగృహం వద్ద కన్నుమూశారు. ఆయనకు భార్య సత్యవతి, కుమారుడు సుందరయ్య ఉన్నారు. ఆయన తుదిశ్వాస వరకూ సిపిఎం కార్యకర్తగా పనిచేశారు. భార్య సత్యవతితో వ్యవసాయ కార్మికుల జీవనగతులు పెంచడానికి నిత్యం పోరాటం చేశారు. ఆయన మృతదేహంపై రైతు సంఘం ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామూర్తి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం సానుభూతిపరులు కెవి.సీతారాం, టి.కోటేశ్వరరావు, సిపిఎం నేతలు పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి గోపాలన్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. సత్తిరాజు సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, నర్సాపురం, పాలకొల్లు డివిజన్ కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకునిగా అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేశారని పేర్కొన్నారు. గ్రామంలో పేదలు, రైతులు, కౌలు రైతులు, ప్రజల సమస్యలపై విశేష కృషి చేశారని తెలిపారు. భార్య సత్యవతి సిపిఎం సభ్యురాలిగా, మహిళా సంఘం నాయకురాలిగా మహిళల సమస్యలపై కృషి చేశారని పేర్కొన్నారు. ఇరువురు సాధారణ జీవితంతో గ్రామంలో అందరి మన్ననలూ పొందారన్నారు. సత్యనారాయణ రాజు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో కాలికి సర్జరీ జరిగి చాలా ఇబ్బంది పడి కోలుకుంటున్న తరుణంలో ఆకస్మికంగా మృతి చెందారని తెలిపారు. ఆయన మృతి సిపిఎం పార్టీకి, ప్రజా సంఘాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సత్తిరాజుకు సిపిఎం జిల్లా కమిటీ తరపున ఘనంగా నివాళులర్పించారు. భార్య సత్యవతికి, కుమారుడు సుందరయ్యకు, కుటుంబ సభ్యులకుసానుభూతి తెలిపారు.

అనంతరం రైతు సంఘం ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామూర్తి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం సానుభూతిపరులు కెవి.సీతారాం, టి.కోటేశ్వరరావు, ఆయన వ్యవసాయ కార్మిక ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతదేహం వద్ద పలువురు విలపిస్తూ ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. సాయంత్రం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు.

సిపిఎం సంతాపం..

సత్యనారాయణరాజు (సత్తిరాజు) మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్), సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, సీనియర్ నాయకులు జుత్తిగ నర్శింహమూర్తి, కేతా సూర్యారావు, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు సంతాపం తెలిపారు.

అలాగే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం..

సత్తిరాజు మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిహెచ్.సోమేశ్వరరావు, కె.బలరాం, టి.కోటేశ్వరరావు, తిరుమల రాజు, వలవల రవి ఉన్నారు.

సత్తిరాజుతో తమ పోరాటాలు, అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుని ఐద్వా నేతలు కన్నీటిపర్యంతమయ్యారు. ఐద్వా పట్టణ కార్యదర్శి బాసిన శ్యామల, దోర రత్నం, ఏలూరి సీత, సీతామహాలక్ష్మి సంతాపం తెలిపారు.

బెట్టింగులకు వైసిపి నేత మృతి


రూ.30 కోట్ల పందెంలో ఓటమి

హత్యేనని బంధువుల ఆరోపణ

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నికల బెట్టింగ్ ఊబిలో ఓ వైసిపి నాయకులు బలయ్యాడు. అధికార పార్టీ విజయం ఖాయమని వైసిపి నాయకుల పందేల్లో మధ్యవర్తిగా వ్యవహరించిన ఈ నాయకుడు తన చేతికొచ్చిన సొమ్మును మరో పందెంలో కాసి దెబ్బతిన్నాడు. ఈ స్థితిలో గెలిచిన వ్యక్తులకు సొమ్ము ఇవ్వలేక అజ్ఞతంలోకి చేరుకున్న ఈ వ్యక్తి అనూహ్యంగా తన ఫార్మ్ హౌస్‌లో మృతదేహమై ఉండడం సంచలనం రేపింది. టిడిపి నేతలు హత్య చేశారని వైసిపి గ్రూపులు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం తూర్పు దిగవల్లి వైసిపి సర్పంచి భర్త జగ్గవరపు వేణుగోపాల్ రెడ్డి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరపున బెట్టింగ్‌లు నిర్వహించారు. పది శాతం కమీషన్‌పై వేణుగోపాల్ రెడ్డి సుమారు రూ.30 కోట్ల వరకు బెట్టింగ్ సొమ్మును సేకరించారు. మంచి వ్యక్తి, సౌమ్యుడిగా, నిక్కచ్చి వ్యక్తిగా పేరొందిన వేణుగోపాలరెడ్డిని బెట్టింగ్ మధ్యవర్తిగా నమ్మారు. ఈ ఎన్నికల్లో వైసిపి ఓడిపోవటంతో పందెంలో గెలిచిన వ్యక్తులు డబ్బుల కోసం వేణుగోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ నెల నాలుగో తేదీన ఎన్నికల ఫలితాల వెలివడిన తరువాత వేణుగోపాల్‌రెడ్డి గ్రామంలో కనిపించలేదని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల పందెం రాయుళ్లు తమ సొమ్ములు తమకు చెల్లించాలని వేణుగోపాల్ రెడ్డి ఇంటిపై దాడి చేశారు. భీమవరం పట్టణం నుంచి వచ్చిన వ్యక్తులు ఏకంగా ఇంట్లో సామానులను తమ వాహనాల్లో తరలించుకుపోయారని ప్రచారం జరుగుతోంది. ఆదివారం ఉదయం గ్రామంలోని వేణుగోపాల రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఆయన మృతదేహం కనిపించడంతో తూర్పు దిగవలి గ్రామంలో కలకలం రేపింది. ఉలిక్కిపడిన గ్రామస్తులు తక్షణమే నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పందెంరాయుళ్లే వేణుగోపాల రెడ్డిని చంపి ఫామ్ హౌస్‌లో పడేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వేణుగోపాల్ మృతదేహం

మనస్తాపంతో వైసిపి అభిమాని ఆత్మహత్య

పుల్లేపులో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి ఓటమితో మనస్తాపానికి గురైన వైసిపి అభిమాని గుర్రం శ్రీనివాస్ (24) ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పుల్లేపులో ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్లేపు గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వైసిపి అబిమానిగా ఉన్న శ్రీనివాస్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమి పాలవ్వడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు అతడిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శ్రీనివాస్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాస్ మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శ్రీనివాస్ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు

బొలేరో వాహనం, ఆటో ఢీకొని ఇద్దరు మృతి చెందగా నలుగురు తీవ్ర గాయాలపాలైన ఘటన నూజివీడు మండలం గొల్లపల్లి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గాయాలపాలైన నలుగురిని స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందినవారు. నూజివీడులో అన్నప్రసన్న కార్యక్రమానికి వెళ్లి తిరిగి మచిలీపట్నానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సర్టిఫికెట్లు, మెడల్స్‌తో శిక్షణ పొందినవారు

కర్రసాము ఉచిత వేసవి శిక్షణ శిబిరం విజయవంతం

ముగింపు కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

కర్రసాము ఉచిత వేసవి శిక్షణ శిబిరం జయప్రదంగా సాగడానికి సహకరించిన వారందరికీ విజిఎంవిఆర్ కృష్ణారావు, ఆలపాటి నాగేశ్వరరావు, పిఎస్.లక్ష్మి, గుడిపాటి నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ఎఆర్‌డిజికె హైస్కూల్‌లో మే 20 నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కర్రసాము వేసవ శిక్షణ శిబిరం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. సభకు శిక్షణ శిబిరం కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. తమ సంఘాల తరపున హేలాపురి బాలోత్సవం సందర్భంగా వచ్చిన పరిచయాల ఆధారంగా ఏర్పాటు చేసిన కర్రసాము శిక్షణ ఇచ్చిన జోగారావు, మోహన్‌రావు, వారి కుటుంబం నేర్చుకున్న పిల్లలు పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. సభలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు అధ్యక్షురాలు పిఎస్.లక్ష్మి మాట్లాడుతూ కర్రసాము నేర్చుకోవడం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలిపారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరులో కర్రసాము ఒకప్పుడు ప్రఖ్యాత గాంచిన విద్యా విన్యాసంగా ఉండేదని, దానిని కాపాడడం కోసం అభివృద్ధి చేయడం కోసం, తాము చేస్తున్న ప్రయత్నానికి జోగా చంద్రశేఖర్, జోగా మోహన్‌రావు తోడ్పడటం సంతోషదాయకమని ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి విజిఎంవిఆర్.కృష్ణారావు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ ప్రయత్నం చేయాలని, తల్లిదండ్రులు బిడ్డలకు మంచి ఆరోగ్య సూత్రాలు నేర్పాలని చెప్పారు. కర్ర సాము శిక్షకులు జోగా చంద్రశేఖర్, జోగా మోహన్‌రావు మాట్లాడుతూ తాము తమ తండ్రి నుంచి నేర్చుకున్న కర్ర సాము విద్యను ఒక శిబిరం ఏర్పాటు చేసి ఇన్ని రోజులు నేర్పే అవకాశం ఇచ్చిన కమిటీ వారికి నేర్చుకున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. నేర్చుకున్న వారు భవిష్యత్తులో కూడా ప్రతి ఆదివారం జరిపే కర్ర సాము శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్.గంగాభవాని, మల్లేశ్వరి, కె.శర్వాణి మాట్లాడారు. సభకు ముందుగా 20 రోజుల నుంచి కర్ర సాము శిక్షణ పొందిన వారు తాము నేర్చుకున్న విన్యాసాలను చేసి చూపించారు. సభలో శిక్షకులకు ఎన్ఆర్ వీల్ క్లబ్ నిర్వాహకులు తరపున అభినందనలు తెలుపుతూ సన్మానించారు. శిక్షణ పొందిన 30 మందికి శిక్షణ శిబిరం సర్టిఫికెట్లను, మెడల్స్ బహుకరించారు.



పార్థసారథిని అభినందిస్తున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

పార్థసారధికి పలువురి అభినందన

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు ఎంఎల్‌ఎగా నూతనంగా ఎన్నికైన కొలుసు పార్థసారధిని ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షులు ఉక్కు సూరి గోపాలకృష్ణ, ఏలూరు జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, జిల్లా కోశాధికారి చిట్టిబోయిన సాయిబాబు, ఏలూరు నగర యాదవ సంఘం అధ్యక్షులు బొట్టా అజయ్, గౌరవ అధ్యక్షులు చిదరబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొట్టి నాగభూషణం, నూజివీడుకు చెందిన జిల్లా యాదవ సంఘం నాయకులు నక్కన బోయిన మురళీకృష్ణ (లాయర్), నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్, జిల్లా యాదవ సంఘం నాయకులు దాసరి స్వామి, నల్లిబోయిన కోటేశ్వరరావు ఎంఎల్‌ఎ పార్థసారధిని సత్కరించారు. కొత్త ప్రభుత్వంలో పార్థసారథికి మంత్రిపదవి అలంకరించాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

రెడ్డి అప్పలనాయుడుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడును ఆదివారం చెంచులకాలనీలోని వారి స్వగృహంలో పలు డివిజన్‌కు చెందిన నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఎంతో క్రమశిక్షణతో పార్టీ కోసం అంకితభావంతో పని చేశారని, ఇకపై అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి వ్యక్తిగత దూషణలకు, ఘర్షణలకు పాల్పడవద్దని చెప్పారు. కూటమి ఇచ్చిన హామీలన్నీ త్వరలోనే అమలవుతాయని చెప్పారు. పార్టీ ప్రయోజనాల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి కష్టపడిన ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నానని రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సరిది రాజేష్, పల్లి విజయ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

2024-2025 విద్యా సంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతికి విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ ఉమాదేవి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. అదేవిధంగా వంద శాతం ట్రెయిన్డ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యూషన్స్ టీచర్స్‌తో బోధన తరగతులు జరుగుతున్నాయన్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం సదుపాయం ఐఎఫ్‌టి, ట్యాబ్‌తో సాంకేతిక విద్య, సంవత్సరంలో రెండుసార్లు వైద్య పరీక్షలు, ప్రతిరోజు యోగా, ఆటలు, యూనిఫామ్, సాక్సులు, పాఠ్య పుస్తకాలు, బాలికలకు నెలసరి శానిటరీ న్యాప్‌కిన్స్ ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నేరాలు - ఘోరాలు


యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


కూలి డబ్బుల విషయంలో మనస్పర్థలు రావడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దర్భగూడెం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దర్భగూడెం గ్రామానికి చెందిన బత్తుల వీరభద్రస్వామి (32) అదే గ్రామానికి చెందిన పొగాకు ఆకుకొట్టు ముఠాలో కూలిగా పనికెళ్తున్నాడు. అయితే అతను చేసిన పని నిమిత్తం రావాల్సిన కూలి డబ్బుల విషయంలో మేస్త్రికి అతనికి మధ్య కొద్ది పాటి వివాదం జరిగింది. అనంతరం ఇంటికెళ్లిన యువకుడు తెల్లారేసరికి చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి

చైతన్య స్కూల్ డైరెక్టర్లు నాగరాజు, నాగబాబు



నాగరాజు



నాగబాబు



చైతన్య స్కూల్

ప్రజాశక్తి -ముసునూరు

నాణ్యమైన విద్యా ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్లు మరీదు నాగరాజు, కె.నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఎల్‌కెజి నుంచే తల్లి లాంటి ప్రేమ, తండ్రి లాంటి బాధ్యత, ఉన్నత నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులే డైరెక్టర్లుగా ఉంటున్నారన్నారు. గ్రామీణంలో మంచి ప్రశాంత వాతావరణంలో చైతన్య స్కూల్ నవ వసంతాలు పూర్తి చేసుకుని, దశ వసంతంలోకి అడుగు పెడుతుందన్నారు. నవోదయ, గురుకుల పాఠశాలలో మంచి ప్రవేశాలు సాధించిన ఘనత చైతన్య స్కూల్‌దే అన్నారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, సివిల్స్ ఎంట్రన్స్ టెస్టుల్లో ప్రతిభ కనబర్చే విధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తమ పాఠశాలలో విద్యార్థులందరూ ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడే వీలుగా స్పోకెన్ ఇంగ్లీషు అలవాటు చేస్తున్నామన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రెగ్యులర్ చదువుతో పాటు ఐఐటి, మెడిసిన్ ఫౌండేషన్, సివిఎస్‌ఇ-స్టేట్ సిలబస్ ఆధారంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల నైపుణ్య వికాసానికి ఎడ్యుకేషనల్ టూర్స్, పేరెంట్స్ మీటింగ్ ద్వారా శిక్షణ, సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆ ఫలితాల గురించి వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. మనోవికాసానికి డ్యాన్సులు, సాంగ్స్, గేమ్స్, మెడిటేషన్ వంటి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబర్చి అవార్డులు సాధిస్తున్నారన్నారు. ఐఐటి, ఎన్ఐటి పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందిస్తున్నామన్నారు. చిన్న నాటి నుంచే చదువుతో పాటు విలువలు, విజ్ఞానం పొందాలంటే తమ పిల్లలను తల్లిదండ్రులు చైతన్య చేర్పించాలని చెప్పారు.

విశ్వశాంతిలో ఉన్నత విలువలు, నాణ్యమైన విద్య

హైస్కూల్ ప్రిన్సిపల్ అరుణకుమారి, కరస్పాండెంట్ రాము



అరుణకుమారి



రాము

ప్రజాశక్తి - మండవల్లి

విలువలతో కూడిన విద్యను అందించాలని లక్ష్యంతో నడపబడుతున్న విద్యాసంస్థ విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అని ప్రిన్సిపల్ ఈడే అరుణకుమారి, కరస్పాండెంట్ ఈడే రాము అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని 1990లో ఈడే రాము చేత విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌గా నామకరణం చేసి లింగాలలో ప్రారంభించినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులను ఏర్పాటు చేసి ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీషులో విద్యాబోధన చేస్తున్నామని చెప్పారు. చక్కని ఆట స్థలంతో పాటు ఆహ్లాదకరమైన చెట్ల మధ్య చల్లని వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దేశం గర్వించదగ్గ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విధంగా తక్కువ ఫీజులతో క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధి విద్యతోనే సాధ్యమని గమనించి ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పట్టుదలతో విద్యార్థులకు విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ కలిగి అంకితభావంతో విద్య నేర్పగలిగిన, ఆంగ్లములో అనర్గళంగా మాట్లాడగలిగిన, విద్యాబోధన చేయగలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి మరి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామని వివరించారు. విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యను అభ్యసిస్తున్నారని పదికి పది సాధిస్తారనే భరోసాను తల్లిదండ్రుల్లో కల్పిస్తున్నామని తెలిపారు. విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో నేటి వరకు పదికి పది సాధిస్తున్నారని చెప్పడానికి గర్వంగా కూడా ఉందన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని అలవర్చుకునే విధంగా క్విజ్ వ్యాసరచన చిత్రలేఖన పోటీలను వ్యాయామానికి సంబంధించిన ఆటలను నిర్వహించడంతోపాటు ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడే విధంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి ప్రతిభ ఆధారంగా విద్యాబోధన చేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో ఆటోల ద్వారా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చేర్పించాలని వారు కోరారు.

శిథిలావస్థకు వాటర్ ట్యాంక్


భయాందోళనలో విద్యార్థులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాల వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి పథకం వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. హాస్టళ్ల మధ్య ఖాళీ స్థలంలో ఈ మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశారు. ముదినేపల్లిలోని సగ భాగం జనాభాకు ఈ వాటర్ ట్యాంకు ద్వారానే కుళాయిలకు నీటి సరఫరా జరుగుతుంది. ఈ మంచినీటి పథకం ఏర్పాటు చేసి సుమారు 25 సంవత్సరాలు కావస్తుంది. దీంతో కాలక్రమేన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దీంతో ట్యాంకు స్లాబ్ ఊడి ఇనుప తీగలు బయటపడి తరచూ ట్యాంకు స్లాబ్ నుంచి పెచ్చులు కింద పడుతున్నాయి. దీంతో హాస్టల్ విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ ట్యాంకు ఏ క్షణాన కూలిపోతుందోనని భయంతో ఇటు విద్యార్థులు, అటు ఈ మార్గాన పోయే ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకును శుభ్రపరిచే నిమిత్తం ట్యాంకు పైకి ఎక్కేందుకు ఏర్పాటు చేసిన మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ట్యాంకును శుభ్రపరిచే అవకాశం లేకుండా పోతుంది. ఈ మంచినీటి పథకం వాటర్ ట్యాంకు రెండు హాస్టళ్ల మధ్య నిర్మాణం చేయడంతో విద్యార్థులు నిత్యం ఈ ఖాళీ స్థలంలోనే ఆటలు ఆడుకుంటారు. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంకు ఏ క్షణాన కూలుతుందోననే భయం విద్యార్థులను, ప్రజలను వెంటాడుతోంది. ప్రమాదం జరగకముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థలో మెట్లు




ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంకు

గంజాయి రహిత నియోజకవర్గంగా ఏలూరు

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరును గంజాయి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దే విషయంలో కఠిన నిర్ణయాలకు కూడా వెనకాడేది లేదని, ఏ పార్టీకి చెందిన వారైనా గంజాయి విషయంలో యువతను తప్పుదారి పట్టిస్తే అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి హెచ్చరించారు. కేవలం రెండు నెలల వ్యవధిలో గంజాయిని పూర్తిగా అరికట్టేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నానని, ఈ విషయంలో బాధ్యతగల ప్రతి పౌరుడు పూర్తిసహకారం అందించాలని కోరారు. ఏలూరులోని కట్టా సుబ్బారావుతోటలో ఎంఎల్‌ఎ బడేటి చంటి అభినందన సత్కార సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక రికార్డు మెజార్టీ సాధించిన ఎంఎల్‌ఎ బడేటికి అభినందనలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఆయనను సత్కరించేందుకు ప్రజలు, అభిమానులు, పార్టీల నేతలు పోటీ పడుతున్నారు. తనను ఆదరించిన ప్రతిఒక్కరినీ గుర్తుపెట్టుకున్న ఆయన స్థానికుల ఆహ్వానాన్ని మన్నించి సన్మాన సభలకు హాజరవుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఏలూరు నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో గంజాయిని నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పోలీసులు, ఇతర శాఖల సహకారంతో ఈ విషయంలో నూటికి నూరుశాతం విజయం సాధిస్తామని, గంజాయిని ప్రోత్సహించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, ఏ పార్టీ వారైనా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఏలూరు చరిత్రలో లేనివిధంగా ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారని, వారి ఆశలు వమ్ముకాకుండా పనిచేయాల్సిన బాధ్యత తనతో పాటూ అందరిపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బడేటి కుటుంబం రాజకీయాన్ని తన ఇంటిపేరుగా మార్చుకుందని, ఆ కుటుంబానికి చెందిన ఎంతోమంది నగరాభివృద్ధికి తమదైన శైలిలో కృషిచేసి బడేటి అంటే ట్రేడ్ మార్క్‌గా మార్చివేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబిఎస్.శర్మ, టిడిపి బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు లంక వెంకట రాజశేఖర్, కడియాల విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడేటి చంటి

ఏలూరు అర్బన్ : ఏలూరు ఎంఎల్‌ఎగా ఎన్నికైన బడేటి చంటిని ఏఐటియుసి అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడు తున్న సందర్భంగా మున్సిపల్ కార్మికులుగా సమస్యలు ఏమన్న ఉంటే తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తానని తెలిపారు. తొందరపడి ఎటువంటి ఆందోళనలు చేయవద్దని ఆయన కోరారు. చంటిని కలిసి అభినందించిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, ఏలూరు నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివకుమార్, ఇంటి అశోక్, అంతరాజు లీలాప్రసాద్ ఉన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

నూజివీడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించడంతో నూజివీడు పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ మెడికల్ క్యాంపులో ప్రముఖ వైద్యులు గోపాలం శ్రీమన్నారాయణ ఎండి, డిఎం (న్యూరో), డాక్టర్ గౌతమ్ ముఖేష్ (మెడ్ స్టార్ హాస్పటల్) వారి పర్యవేక్షణలో పేద ప్రజలకు, రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. అతి తక్కువ ధరలకు బిపి, షుగర్, గ్యాస్ మందులు పంపిణీ చేశారు. ఈ అవకాశం ప్రతి రెండు నెలలకు రెండో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే అని చెప్పారు. ఈ అవకాశాన్ని నూజివీడు పట్టణం వివిధ ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని మానవత స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ వారు కోరారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

పట్టించుకోని అధికారులు
ప్రజల నుంచి విమర్శలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీలోని పాపయమ్మ చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా బడా నేతల అనుచరులతో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు సైతం అడ్డుకునే పరిస్థితి లేదని, జిల్లా స్థాయి అధికారులు సైతం మౌనంగా ఉంటున్నారని స్థానికులు విమర్శిస్తు న్నారు. మట్టి మాఫియా దారులు రైతుల పొలాలను చదును చేస్తున్నామని సాకుతో అనుమతులు ఏమి పొందకుండా బయటకు తరలిస్తున్నారు. పాపయమ్మ చెరువులో అక్రమంగా జెసిబిల సాయంతో వందల ట్రాక్టర్లు మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో మట్టి దందా రాయుళ్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కుంటలు చెరువులు వదలకుండా వాటిని గుల్ల చేస్తూ మట్టిని ఇటుక బట్టీలకు, గృహ నిర్మాణాల పునాదులకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సాగునీటి వనరులను కాపాడాల్సిన అధికారులు మిన్నకుం డిపోయారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసు న్నారు. చెరువుల అభివృద్ధితో పాటు వాటిని సంర క్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎప్పటిక పుడు నీటి పారదల శాఖాధికారులు పరిశీలిం చకపోవడం వల్ల చెరువులు ఆక్రమణలకు గురవు తున్నాయని, పాపయమ్మ చెరువులో యధేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నా చూసీ చూడనట్టుగా రెవెన్యూ, నీటిపారుదల శాఖాధికారులు వ్యవహరి స్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. కొన్నిరోజులుగా వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్న అక్రమార్కులపై ఇప్పటి కైనా ఉన్నతాధికారులు చొరవ చేసుకుని చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

బొర్రా చలమయ్యకు సన్మానం

గౌడ సంఘం ఆధ్వర్యంలో కేక్ కటింగ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

బిజెపి కైకలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలుపునకు తన వంతు కీలక పాత్ర పోషించిన టిడిపి నాయకులు బొర్రా చలమయ్యను ఆదివారం రాత్రి మండలంలోని పెనుమల్లి గ్రామంలోని ఎ లిటిల్ ఫ్లవర్ ది లీడర్ స్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గంలోని గౌడ, శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బొల్లా శ్యామల రాజు గౌడ్, బొర్రా శేషులు సభాధ్యక్షత వహించారు. చలమయ్యను సంఘ పెద్దలు పూలమాలలతో, దుశ్శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని 30 వేల మంది గౌడ, శెట్టిబలిజ సోదర, సోదరీ మణులందరిని ఏకతాటి పైకి తీసుకొచ్చి కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గెలుపునకు అఖండ మెజారిటీ చేకూర్చిన చలమయ్యను సత్కరించుకోవటం మన అందరి బాధ్యతని గుర్తు చేశారు. బొర్రా చలమయ్య మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఇంతటి మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని అభివాదించారు. అనంతరం విజయోత్సవ కేకును చలమయ్య 300 మందితో కలిసి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరసా ఏడుకొండలు, ముదినేపల్లి మండలాధ్యక్షులు పరసా కనకారావు, మండవల్లి మండల అధ్యక్షులు బొర్రా సత్యనారాయణ, కలిదిండి మండలాధ్యక్షులు కట్టా పాండురంగారావు, కైకలూరు మండలాధ్యక్షులు కట్టా నాగబాబు, శొంఠి నాగరాజు, గూడవల్లి కోటేశ్వరరావు, తామరకొల్లు గ్రామ అధ్యక్షులు వీరంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజేష్ ఆన్‌లైన్ బైబిల్ క్విజ్ పోటీ ప్రతివారం నిర్వహిస్తున్నారు. రాజేష్ తన వాట్సాప్ స్టేటస్ ద్వారా ప్రశ్నిస్తున్నారు. వాట్సాప్ కాంటాక్ట్స్ ఉన్న వ్యక్తులు ఆన్సర్ చెప్పిన వాళ్లకి మొదటి బహుమతిగా సీల్డ్ ఇస్తున్నారు. ఏలూరు నుంచి బొబ్బిలి దుర్గాభవాని గత నాలుగు వారాలుగా మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా పర్వతాపురం గ్రామానికి చెందని కల్లేపల్లి శ్రావణి రెండు వారాలు మొదటి స్థానం సాధించినట్లు రాజేష్ తెలిపారు. ఈ వారం బూరుగుగూడెం నుంచి మధురవాణి, సి.గుడిపాడు నుంచి సతీష్ మొదటి స్థానం సాధించారని తెలిపారు. వారి ఇళ్లకు వెళ్లి బహుమతులు అందించినట్లు చెప్పారు. క్రైస్తవ మతాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మాత్రం కాదని, ఏ మతం చెప్పినా సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, అన్ని మతాలు మానవత్వాన్ని ప్రబోధించాయని రాజేష్ తెలిపారు. ప్రకృతి ధర్మాల గురించి, మంచి చెడులు గురించి తెలియాలంటే, మత గ్రంథాలను తప్పక చదవాలన్నారు. మన పూర్వీకులు ఆచరించిన న్యాయ ధర్మాలు, మంచి చెడులు కథల రూపంలో, ఉపమానాల రూపంలో మత గ్రంథాల్లో దొరుకుతాయఅన్నారు. మనుషులు చేసే మంచి పనులు గాని, చెడు పనులు గాని ఆ గ్రంథాల నుంచి నేర్చుకుని జీవిస్తున్నారన్నారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నందుకు టిడిపి నాయకులు గత ఐదు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో సంబరాలు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని పెదకామనపూడి గ్రామంలో నియోజకవర్గంలో కామినేని శ్రీనివాస్, రాష్ట్రంలో టిడిపి కూటమికి అత్యధిక మెజారిటీ రావడంతో గ్రామస్తులు ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాల్లో తెలుగుదేశంపార్టీ నాయకులు కొడాలి వినోద్ పాల్గొని కామినేని శ్రీనివాస్ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టిడిపి కూటమి నాయకులంతా ఎటువంటి కక్ష సాధింపులకు పోకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, జనసేన మండలాధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలోని కోడూరులో నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద టిడిపి కూటమి విజయోత్సవ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పెంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు చల్లగుల్ల ఆదిత్య, యెర్నేని కిషోర్ బాబు, బొర్రా చల్లమయ్య, అడుసుమిల్లి సుకుమార్, కోడూరు శేషు బాబు, వల్లభనేని శివాజీ, బొంగు నాని, ఈడుపుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీనివాసవర్మకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మను బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు ఆదివారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ పురంధేశ్వరి, మెదక్ ఎంపీ రఘునందనరావు, లోక్‌సభ స్పీకర్ బిర్లాలను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.